క్లుప్తంగా

శ్రీరంగనాథుడి గ్రామోత్సవం



పల్లకీలో ఊరేగుతున్న స్వామివారు

మద్దికెర: మండలపరిధిలోని పెరవలి రంగనాథుడిని మంగళవారం పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఉదయం అర్చకులు స్వామి వారికి బిందెసేవ నిర్వహించి పూజలు చేశారు. సుందరంగా అలంకరించి అష్టోత్తరనామార్చన, అభిషేక కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణ చేశారు. సాయంత్రం స్వామి వారికి సతీసమేతంగా గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్ రెడ్డితో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భక్తులకు ఉచిత వైద్య శిబిరం

మద్దికెర: మండల కేంద్రానికి 6 కి.మీ దూరంలో ఉన్న అనంతపురం జిల్లా కసాపురం పుణ్యక్షేత్రంలో ఉగాది ఉత్సవాల సందర్భంగా విచ్చేసిన భక్తులకు మద్దికెర, వెల్దుర్తి మండలాల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యులు రఘునాథ రెడ్డి, వలి, రాము అన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. గత 24 ఏళ్లుగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈఓ భద్రాజీ, ఏఈఓ మఠం మల్లికార్జున పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

ఆస్పరి: నగరూరు బస్టాప్ దగ్గర ఈనెల 7వ తేదీన రాత్రి మతిస్థిమితం సరిగాలేని మహిళపై అత్యాచారం చేసిన నిందితుడు రాముడును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఆస్పరి సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ రాత్రి బిణిగేరికి చెందిన మతిస్థిమితం సరిగాలేని మహిళపై నగరూరు గ్రామానికి చెందిన రాముడు అనే వ్యక్తి అత్యాచారం చేశాడని, ఘటనపై బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిని మంగళవారం ఆస్పరి అంబేడ్కర్ సర్కిల్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చర్యలు

పత్తికొండ రూరల్: సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పత్తికొండ అర్బన్ సీఐ మురళీమోహన్ హెచ్చరించారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ గ్రూప్‌ల వేదికగా గొడవలు సృష్టించేలా, ఇతరులను కించపరిచేలా పోస్టులు పెడితే ఉపేక్షించేది లేదన్నారు. ఆకతాయిలు పెట్టే పోస్టులకు గ్రూప్ అడ్మిన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు.

నిర్భయంగా ఓటు వేయండి

దేవనకొండ: మండలంలోని నల్లచెలిమల, గుడిమిర్లాళ్ల, బంటుపల్లి, చెల్లిచెలిమల, బేతపల్లి, బండపల్లి గ్రామాల్లో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. పోలీసుల భద్రత నడుమ ఓటింగ్ జరుగుతుందని, ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

చలివేంద్రాల ప్రారంభం

ఆస్పరి: కై రుప్పల గ్రామంలో వీరభద్రస్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల దాహార్తి తీర్చేందుకు కామ్రేడ్ బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ.. 9 రోజులపాటు జరగనున్న ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొననుండడంతో వారి సౌకర్యార్థం కైరుప్పలలో రెండు, పుప్పాలదొడ్డిలో ఒక చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

మద్దికెర: స్థానిక ప్రధాన బజారులో ఫ్రెండ్స్ స్కూల్ కరస్పాండెంట్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున, రామాంజులు, ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యు లురామాంజులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలోని కుంకనూరు టర్నింగ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. స్వర్గీయ కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటిశెట్టి, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణయ్య తెలిపారు. చలివేంద్రం ప్రారంభం సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు.

అక్రమంగా కుళాయి కనెక్షన్లు

గోనెగండ్ల: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ నిబంధనలు అతిక్రమించి గోనెగండ్ల ఎస్సీ కాలనీ, కురువ పేట కాలనీల్లో మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామ అధికారుల అనుమతులు లేకుండా టీడీపీ నాయకుల ప్రాద్బలంతో సోమవారం రాత్రి రోడ్డును తవ్వి కొళాయి పైపులైన్ వేసుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ పంచాయతీ అధికారులు రోడ్డును తవ్వి పైపులైన్ వేసుకున్న వారికి నోటీసులు జారీ చేశారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఈఓ సతీష్ మాట్లాడుతూ.. రోడ్డును తవ్వడంతో పాత పైప్‌లైన్ కనెక్షన్లు విరిగిపోయాయని వాటికి మరమ్మతులు చేశామన్నారు. అక్రమంగా రోడ్డును తవ్వి పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్న వారికి నోటీసులు జారీ చేశామని తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉగాది వసంతం.. మురిసిన గ్రామీణం

శ్రీ క్రోధి నామ సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మంగళవారం మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కొత్త దుస్తులు ధరించి ఇంటి గుమ్మాలను మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. పులుపు, కారం, ఉప్పు, తీపి, చేదు, వగరు వంటి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, భక్షాలు, పిండివంటలు చేసి ఇష్టదేవుళ్లకు నైవేద్యంగా సమర్పించారు. సమీపంలో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం, రాశి ఫలాలను వివరించారు. గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లి అరక పూజలు చేసి గుంటిక పాసి వ్యవసాయ పనులు ప్రారంభించారు. – తుగ్గలి



కృష్ణగిరి: పూజలందుకుంటున్న కర్లకుంట తిరుమలరాయస్వామి



రత్నపల్లెలో ప్రభోత్సవం



పత్తికొండ చెన్నకేశవస్వామి ఆలయంలో పంచాగ శ్రవణం వింటున్న రైతులు



ఆలంకొండలో ఎద్లను అలంకరించి పారువేటకు వెళుతున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలో అన్నదాతలు ఉదయమే కాడెద్దులతో పొలాలకు వెళ్లి పూజలు నిర్వహించి గుంటక పాశారు. సాయంత్రం కృష్ణగిరి, అమకతాడు, ఆలంకొండ, పెనుమాడ తదితర గ్రామాల్లో పారువేట కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఆలంకొండలో ఎడ్ల బండ్లతో పారువేట కార్యక్రమం నిర్వహించారు. చుంచుఎర్రగుడిలో రామలింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధులగుండా మేళతాళాలతో ఊరేగించారు. ఎరుకలచెర్వు గ్రామంలో బుధవారం ఉదయం తిమ్మగురుని ప్రభోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం స్వామిని పల్లకీలో వీధుల గుండా ఊరేగించడం జరుగుతుందని వారు తెలిపారు. కటారుకొండలో బుధవారం సాయంత్రం గుంటి రంగస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, హంప, ఎడవలి, బసినేపల్లి గ్రామాలలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కవిరెడ్డి, బెస్త వీధులకు చెందిన యువకులు రంగులు చల్లుకుంటూ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా కేరింతలు వేసుకుంటూ ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం రత్నపల్లెలో సీతా, రామ, లక్ష్మణుడు, ఆంజనేయస్వాముల చిత్రపటాలతో గ్రామం వెలుపల 40 అడుగుల ప్రభోత్సవం నిర్వహించారు. వెల్దుర్తి సుంకులమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అమ్మవారిశాల, ఎల్లమ్మ గుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. వెల్దుర్తి శ్రీరాముల దేవాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మన దశరథరామిరెడ్డి, సుబ్బారెడ్డి, పలువురు ప్రముఖుల ఆధ్వర్యంలో పండితుడు కృష్ణశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు.

వైభవంగా నరసప్పస్వామి ప్రభోత్సవం



ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



ముగతిలో ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో ఉగాది పర్వదినం పురస్కరించుకొని నిర్వహించిన నరసప్ప స్వామి ప్రభోత్సవం మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. వేడుకల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పాల్గొన్నారు. అలాగే ఆలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ రంగస్వామి, బుట్టా నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మిట్టసోమపురంలో లింగమయ్య దేవర ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం నందవరం, ముగతి, కనకవీడు, సోమలగూడూరు, నాగలదిన్నె, జోహారాపురం, నదికైరవాడి, గురజాల తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో దేవతా మూర్తులకు ఉదయం పిండి వంటలతో భక్తులు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాలలో వెలసిన శ్రీసుంకులమ్మ, మారెమ్మ దేవతలకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మిట్టసోమపురంలో ప్రజలు ప్రత్యేకంగా చేసిన నైవేద్యాలను బోనాల్లో ఉంచుకొని డప్పు దరువులు, మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి శ్రీసుంకులమ్మ, మారెమ్మ, లింగమయ్యకు బోనాలు సమర్పించారు. ముగతి గ్రామంలో ప్రభోత్సవం నిర్వహించారు. పురవీధుల్లో బారులు తీరిన భక్తుల మధ్య కుంభోత్సవం కనువిందు చేసింది. అనంతరం బలిదానులు కానిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ తెలుగు లక్ష్మీదేవి, భక్తులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని అన్ని దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణకుంభాలతో తప్పెట్లు, మేళతాళాలతో ఆలయాలకు వెళ్లి బలిదానం కానిచ్చి పూజలు చేశారు. స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో వీరశైవ పీఠాధిపతి శివయ్య స్వామి పంచాంగ శ్రావణంలో రాశిఫలాలు, గ్రహ స్థితిగతులను వినిపించారు. సాయంత్రం స్థానిక ఆంజనేయస్వామి వారి ఉత్సవమూర్తిని రథంపైలో కొలువుంచి ఊరేగింపుగా శివాలయం దేవాలయం వరకు తీసుకెళ్లి తిరిగి యథాస్థానానికి చేర్చారు.





గోనెగండ్లలో ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు, నందవరం: ప్రత్యేకాలంకరణలో లింగమయ్య స్వామి

కనులపండువగా ప్రభోత్సవం



మూసానహళ్లిలో సోమలింగేశ్వర ప్రభోత్సవం



మూసానహళ్లిలో పూజలందుకుంటున్న సోమలింగేశ్వర స్వామి

ఆలూరు రూరల్: ఉగాది పర్వదినం పురస్కరించుకుని మూసానహళ్లి గ్రామంలో సోమలింగేశ్వర స్వామి ప్రభోత్సవం వైభవంగా జరిగింది. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6.30 గంటలకు భక్తుల నడుమ ప్రభోత్సవం నిర్వహించారు. నిర్వాహకులు అన్నప్రసాదాలను పంచిపెట్టారు. అలాగే మనేకుర్తి గ్రామంలో రామలింగేశ్వర స్వామి ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు.

హొళగుంద: మండల పరిధిలోని పెద్దగోనేహాళ్, హెబ్బటం, వందవాగిలి, బీజీ హళ్లి గ్రామాలలో వెలసిన సుంకులమ్మ దేవి, సవారమ్మ, దుర్గమ్మవ్వ, రామలాంభికదేవి రథోత్సవాలు మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఉదయమే అమ్మవార్లకు గంగిపూజ, జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులను తీర్చుకున్నారు. సాయంత్రం అశేష భక్తజనుల జయజయధ్వనుల మధ్య రథోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్దగోనెహాళ్ తదితర గ్రామాలలో వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరుపాక్షి వేడుకల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. నాయకులు కొత్తింటి వెంకటరెడ్డి, రాంభీంనాయుడు, మఠ్రిస్వామి, రంగస్వామి, మల్లారెడ్డి, పాండు తదితరులు ఉన్నారు. హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్య నాయుడు బందోబస్తు నిర్వహించారు.

ఆస్పరి: మండల కేంద్రంలో జనార్దన స్వామి రథోత్సవం అశేష జనవాహిని మధ్య వైభవంగా జరిగింది. ఆలయ పూజారి నరసింహయ్య రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గ్రామంలోని పురవీధుల గుండా స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో ప్రభోత్సవం నిర్వహించారు. సాయంత్రం కుంభాన్ని మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం పల్లకీ సేవ, జనార్దన స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి మేళతాళాలు, బాణసంచా పేలుస్తూ స్వామి వారి రథాన్ని కొల్లాపురం అవ్వ ఆలయం వరకు లాగారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి యథాస్థానానికి చేర్చారు. అలాగే ఆస్పరి మారెమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ మూలింటి రాధమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. నగరూరులో మారెమ్మవ్వ రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవనకొండ: మండలకేంద్రంలో చెన్నకేశవస్వామిని భక్తులు మంగళవారం రాత్రి పల్లకీలో ఉంచి గ్రామ పురవీధులగుండా ఊరేగించారు. పల్లకీలో ఊరంతా ఊరేగిస్తూ పురోహితులు భవిష్యవాణి వినిపించారు. పండించే పంటలు, ఏ ధాన్యానికి అనుకూలం, పశువుల సంతతి తదితర వాటిని వివరించారు. కూకటికొండ, కప్పట్రాళ్ల, కరివేముల, తెర్నేకల్ తదితర గ్రామాల్లో ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి, హొళగుందలోని వీరభద్రేశ్వరస్వామి, సిద్ధేశ్వర స్వామి తదితర ఆలయాలలో పూజారులు జలాభిషేకం, రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, ఆకుపూజ, మహామంగళారతి నిర్వహించి నైవేద్య సంతర్పణ కార్యక్రమం చేపట్టారు. భక్తులు దేవుళ్లకు ఉగాది పచ్చడి, పిండి వంటలు నైవేద్యంగా పెట్టారు. గజ్జహళ్లి గ్రామంలో రాతిగుండు ఎత్తే పోటీలు నిర్వహించారు. సాయంత్రం హొళగుందలోని విరక్తమఠం, భోగేశ్వరస్వామి ఆలయాల్లో వేద పండితులు గురుశిద్దయ్యస్వామి, వేదమూర్తిస్వామి భక్తులకు పంచాంగం చదివి వినిపించారు.



వందవాగిలిలో దుర్గమ్మవ్వ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఆస్పరిలో భక్తజనం మధ్య కదులుతున్న జనార్ధన స్వామి రథం



నంచర్లలో అమ్మవారికి పూజలు

సంక్షేమ సారథికి పట్టం కట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: ఐదేళ్ల పాలనలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్ కోరారు. ఆయన మంగళవారం పట్టణంలోని 25వ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేస్తే సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోతాయని, పేదలకు మళ్లీ కష్టాలు మొదలవుతాయన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బీఎస్ నాగరాజు, మాధవస్వామి, సలీం, అన్వర్‌బాషా, సోమశేఖర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ప్రచారం చేస్తున్న రుద్రగౌడ్

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



సోమలగూడూరులో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

నందవరం: మండల పరిధిలోని సోమలగూడూరులో ఉగాది పండుగ పురస్కరించుకుని మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి పోటీలను ప్రారంభించారు. పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామానికి చెందిన వృషభాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. బోయ నాగరాజు ఎద్దులు విజేతగా నిలిచి రూ.20,016 కైవసం చేసుకోగా, రెండవ స్థానంలో నిలిచిన బోయ ఈరన్న వృషభాలు రూ.15,016, మూడో స్థానంలో నిలిచిన బోయ రామాంజిని ఎద్లు రూ.10,016 గెలుపొందాయి. దాతలు వెంకటేశ్వరరెడ్డి, బాలాముణి, భీమన్న, రామంజిని, యర్రన్న, సోమన్న, వెంకటేష్, పెద్దయ్య, పాండు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

గోనెగండ్ల: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపిస్తామని సీఐ రామకృష్ణయ్య పేర్కొన్నారు. డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గంజిహళ్లి, బైలుప్పల, బి.అగ్రహారం గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఆయా వీధుల్లో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణయ్య మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజల్లో ధైర్యం నింపేలా ఆయా గ్రామాల్లో రూట్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకునేలా కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. కవాతులో ఎస్ఎస్‌బీ అసిస్టెంట్ కమాండెంట్ రాకేష్‌కుమార్, కేంద్ర మిలటరీ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

హొళగుంద: సార్వత్రిక ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు ఎల్లార్తి గ్రామస్తులను కోరారు. ఆయన సోమవారం రాత్రి గ్రామంలో బస చేసి ఎన్నికలకు సంబంధించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కక్షలు, కార్పణ్యాలకు పోకుండా గ్రామాభివృద్ధికి పాటు పడాలన్నారు. రాజకీయ నాయకులు మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

12 నుంచి కబడ్డీ పోటీలు

ఆస్పరి: మండలంలోని కై రుప్పలలో వీరభద్ర స్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 12వ తేదీ నుంచి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రమేష్, చందు, వినోద్ మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.20 వేలు, వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల జట్లు ఈ నెల 11వ తేదీలోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 93460 89027, 62819 71243 నంబర్లను సంప్రదించాలన్నారు.

ముందస్తు ఆస్తిపన్ను చెల్లింపుపై రాయితీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తు ఆస్తి పన్ను ఈ నెల 30వ తేదీలోగా చెల్లించే వారికి 5 శాతం రాయితీని ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 30వ తేదీలోగా ఆస్తి పన్ను, ఖాళీ స్థలాలపై ఉన్న పన్నులు చెల్లించే వారికి రాయితీ లభిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పన్నుల వసూలు కౌంటర్లో లేదా వార్డు సచివాలయాలు, ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. సెలవు రోజుల్లో కూడా కార్యాలయంలో పన్నుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

కృష్ణగిరి: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామ శివారులో నాటుసారా స్థావరంపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. గ్రామానికి చెందిన ఉప్పరి సుధాకర్ గ్రామ శివారులోని హంద్రీ బ్రిడ్జికి సమీపంలో ముళ్లపొదల్లో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లగా గమనించి నిందితుడు పరారయ్యాడు. స్థావరం వద్ద ఉన్న వెయ్యి లీటర్ల బెలం ఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్న చేరికలు



వైఎస్సార్‌సీపీలో చేరిన నిత్రవట్టి గ్రామస్తులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న విరూపాక్షి



విరూపాక్షిని సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

ఆలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొసాగుతున్నాయి. మంగళవారం ఆలూరులోని పార్టీ కార్యాలయంలో.. హాలహర్వి మండలం నిత్రవట్టి గ్రామ వడ్డె సామాజిక వర్గానికి చెందిన సురేష్, లక్ష్మిరెడ్డి, నాగరాజు, ఎల్లా లింగ, వెంకటేష్, రాజశేఖర్, అంజి, అనీల్, వనయ్యలతో పాటు 40 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కష్టపడి పనిచేసి విరూపాక్షిని అఖండ మెజారిటీతో గెలిపిస్తామని వారు పేర్కొన్నారు.

అలాగే ఆస్పరి మండలం జొహరాపురానికి చెందిన వైస్ సర్పంచ్ జనార్ధన్ సొంత గూటికి చేరారు. ఆయన సోమవారం ఆలూరులోని పార్టీ కార్యాలయంలో విరూపాక్షిని కలిసి వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. గ్రామ నాయకులు ప్రకాష్, బొజ్జన్న ఉన్నారు.

హొళగుంద: చిప్పగిరిలోని విరూపాక్షి నివాసంలో హొళగుందకు చెందిన టీడీపీ నాయకులు సినిమా మల్లి, పులి మల్లయ్య, దిడ్డి మల్లయ్య, పాలాక్షి, సూరెడ్డి, ఆయకల్ వీరేశ్, హనుమేశ్ తదితరులతో పాటు 30 కుటుంబాల వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి విరూపాక్షి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు

చిప్పగిరి: స్థానిక సత్తార్ హాజీ సయ్యద్ దర్గాలో మంగళవారం మండలంలోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు విరుపాక్షిని ఘనంగా సన్మానించారు. మండల కో–ఆప్షన్ మెంబర్ సర్వర్‌ఖాన్, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

ఆలూరు: జీవితంలో అంతఃకరణశుద్ధితో ముందుకు సాగితే విజయం సాధించవచ్చని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం త్రైతసిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు రంగస్వామి సమక్షంలో శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి వారి క్రోధి నామ తెలుగు సంవత్సరం నూతన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.

ఎన్నికల సిబ్బందికి నేడు శిక్షణ

ఎమ్మిగనూరురూరల్: 144–అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో బుధవారం నుంచి ప్రిసైడింగ్/సహాయ ప్రిసైడింగ్‌లు, ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఉంటుందని తహసీల్దార్ పి.శేషారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం జరగవలసిన శిక్షణ కార్యక్రమం విద్యార్థుల పరీక్షల కారణంగా 12వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల నిర్వహిస్తారని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు జరగవలసిన శిక్షణ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు.

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నియోజకవర్గంలోని ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రామునాయక్ మంగళవారం తెలిపారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పీఓలు, ఇతర ఎన్నికల సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.